క్లుప్తంగా

కోట సత్తెమ్మ వారి హుండీ ఆదాయం రూ.20.01లక్షలు


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఆలయ హుండీలో రూ.19,01,709, అన్నదాన ట్రస్ట్ హుండీలో రూ.99,640 కలిపి మొత్తం రూ.20,01,345 నగదు, 2.80 గ్రాముల బంగారం, 110 గ్రాముల వెండి లభించాయని అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు. 60 రోజుల కాలానికి ఈ లెక్కింపు జరిపారు. దేవదాయ శాఖ తాడేపల్లిగూడెం తనిఖీదారు సీహెచ్ బాబునాయుడు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ప్రధానార్చకులు అప్పారావుశర్మ పాల్గొన్నారు.

అంధుల ఆశ్రమానికి ఆర్డీవో విరాళం


ఆశ్రమానికి విరాళం అందజేస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: పట్టణంలో దృష్టి ప్రదాత అంధుల ఆశ్రమానికి ఆర్డీవో రాణి సుస్మిత మంగళవారం రూ.5,400 నగదు విరాళంగా అందజేశారు. ఆశ్రమం నిర్వాహకుడు శ్రీనివాసరావుకు చేతి కర్రల కొనుగోలు కోసం ఈ విరాళం ఇచ్చారు. ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి జవహర్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తుడికి 'మానవత' ఆర్థిక సాయం


బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

నల్లజర్ల: అచ్చన్నపాలెంలో మెదనరాల వ్యాధితో బాధపడుతున్న గారపాటి గంగారావుకు మండల మానవత సంస్థ మంగళవారం రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందజేసింది. బాధితుడు త్వరగా కోలుకోవాలని సంస్థ ప్రతినిధులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మండల చైర్మన్ భోగవల్లి వెంకటసుబ్బారావు, ప్రతినిధులు ఐడీవీ అప్పారావు, పాతూరి రమేష్, పాతూరి సత్యనారాయణ, కసుకుర్తి వెంకటకృష్ణారావు, ముళ్లపూడి రత్నం, దండమూడి వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కమిటీలో ఇద్దరికి స్థానం


నల్లజర్ల భవాని


మనోహరకుమార్

నల్లజర్ల: యూటీఎఫ్ జిల్లా కమిటీలో నల్లజర్ల మండలం నుంచి ఇద్దరికి స్థానం లభించింది. తూర్పుగోదావరి జిల్లా యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు సోమవారం నిడదవోలులో జరిగాయి. ఇక్కడ జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో మండలంలోని తెలికిచెర్ల జెడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న నల్లజర్ల భవాని జిల్లా మహిళా కార్యదర్శిగా రెండోసారి నియమితులయ్యారు. అలాగే నల్లజర్ల జెడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న సీహెచ్ఎస్ఎస్ మనోహరకుమార్ మూడోసారి జిల్లా కార్యదర్శిగా ఎంపికయ్యారు. వీరికి సంఘ నల్లజర్ల మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్, బి.కిశోర్ అభినందనలు తెలిపారు.

ఘనంగా లక్ష రుద్రాక్షార్చన


శివాలయంలో స్వామి వారికి నిర్వహించిన రుద్రాక్ష పూజ

చాగల్లు: కార్తిక మాసం సందర్భంగా మంగళవారం చాగల్లు రాజరాజేశ్వరి దేవాలయంలో లక్ష రుద్రాక్షార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి విగ్రహానికి రుద్రాక్షలతో పూజలు చేశారు. తొలుత స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. బ్రాహ్మణగూడెంలో బాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో, మార్కొండపాడు ఉమా మార్కండేయ స్వామి ఆలయంలో, ఊనగట్ల శివాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

నిబంధనలపై నీళ్లు

- మద్యం షాపుల వద్ద అనధికార సిట్టింగ్ రూమ్‌లు
- మండల సమాఖ్య కార్యాలయం ముందే దుకాణం
- బ్యాంకు చెంతనే మరొకటి ఏర్పాటు
- ఇబ్బందులు పడుతున్న మహిళలు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు


పట్టణంలో బ్యాంకు చెంతనే మద్యం షాపు

నిడదవోలు: కూటమి సిండికేట్లు, కొందరు అధికారులు కుమ్మక్కై నూతన మద్యం విధానంలో నిబంధనలకు నీళ్లు కుమ్మరిస్తున్నారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులు కూడా చూసీచూడనట్టు వదిలేయడంతో మద్యం వ్యాపారులు మరీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొత్త మద్యం పాలసీని తెచ్చిన కూటమి ప్రభుత్వం.. ఎన్నో హామీలు ఇచ్చింది. మద్యం ధరల నియంత్రణ, నాణ్యత అంటూ చెప్పినవన్నీ అమలులో కనిపించడం లేదు. కనీసం మద్యం షాపుల ఏర్పాటులో నిబంధనలను కూడా కొన్నిచోట్ల తుంగలో తొక్కేసింది.

నియోజకవర్గంలో ఉన్న 19 మద్యం షాపుల్లో దాదాపు అన్ని చోట్లా అనధికార సిట్టింగ్ రూమ్‌లను బార్లు తలపించేలా ఏర్పాటు చేశారు. సిట్టింగ్ రూమ్‌లలో బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేశారు. పట్టణంలో జనవాసాలు, ప్రధాన రహదారుల చెంతనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇలా ఏర్పాటు చేయడంపై ప్రజలు, మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహిళా సమాఖ్య కార్యాలయం ముందే.. ..

పట్టణంలో రైల్వేస్టేషన్ సెంటర్‌లో మహిళా సమాఖ్య కార్యాలయం ముందు నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపు ఏర్పాటు చేశారు. ఇక్కడ సిండికేట్ వ్యాపారులు మండల సమాఖ్య కార్యాలయం ముందు భాగంలో గ్రీన్ క్లాత్‌ను ఏర్పాటు చేసి, వ్యాపారాన్ని విచ్చలవిడిగా కొనసాగిస్తున్నారు. మండలంలో 1,725 డ్వాక్రా గ్రూపులున్నాయి. ఇందులో 17,250 మంది మహిళలు ఉన్నారు. నెలకు మూడు సార్లు ఇక్కడ సమావేశాలు జరుగుతాయి. ప్రతి రోజు రుణాల మంజూరు, ఇతర లావాదేవీల కోసం మహిళలు ఈ కార్యాలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. మద్యం షాపుతో వీరంతా ఇబ్బందులు పడుతున్నారు. దీనిని వేరే చోటికి తరలించాలని కోరుతున్నారు.

పట్టణంలో గణేష్ సెంటర్లో..

చాగల్లు ప్రధాన రహదారిలో ఉన్న కెనరా బ్యాంక్ చెంతనే నిబంధనలకు నీళ్లొదిలి సిండికేట్ వ్యాపారులు మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. దీంతో బ్యాంక్‌కు వచ్చే ఖాతాదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విశాలమైన భవనం ముందు భాగంలో బ్యాంకు ఉండగా, ఇదే భవనం వెనుక భాగంలో మద్యం షాపు ఏర్పాటు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా విశాలమైన సిట్టింగ్ రూమ్ కూడా నిర్మించారు. మందుబాబులు కూర్చొని తాగడానికి అనువుగా రెండు గదులు, అనేక సదుపాయాలు కల్పించారు. దీంతో బ్యాంకుకు రావడానికి మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నిడదవోలు పట్టణంతో పాటు, పరిసర గ్రామాలకు చెందిన ఖాతాదారులతో పాటు, నిత్యం వందలాది మంది డ్వాక్రా మహిళలు ఈ బ్యాంకుకు వస్తుంటారు.

ఏదీ వదలకుండా..!

జనావాసాలు, ప్రధాన రోడ్డు చెంతనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి, 220 మీటర్ల నిబంధనలకు మద్యం వ్యాపారులు నీళ్లు వదిలారు. పట్టణంలో పాటిమీద సెంటర్, బస్టాండ్ సెంటర్, మండలంలోని సమిశ్రగూడెం, తాడిమళ్ల, డి.ముప్పవరం, మద్దూరు వంతెన వద్ద ప్రధాన రహదారిలో షాపులు ఏర్పాటు చేశారు. బస్టాండ్ సెంటర్‌లో ప్రధాన రహదారి పక్కనే మండల సమాఖ్య మహిళా మార్టు పక్కనే షాపు ఉండటంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ నుంచి షాపును వేరే చోటికి మార్చాలని కోరుతున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> 
>
> మద్యం షాపుల వద్ద సిట్టింగ్ రూమ్‌లకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. ఇప్పటికే మద్యం షాపుల వద్ద తనిఖీలు కూడా చేస్తున్నాం. మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.
>
> – ఏజే సతీష్‌బాబు, ఎక్సైజ్ సీఐ, నిడదవోలు


అనధికార సిట్టింగ్ రూమ్


పట్టణంలో మహిళా సమాఖ్య కార్యాలయం ముందు మద్యం దుకాణం


పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో అనధికార సిట్టింగ్ రూమ్‌లో మద్యం సేవిస్తున్న మందుబాబులు


తిమ్మరాజుపాలెంలో షాపు వద్ద మద్యం సేవిస్తూ..

బంగారు పాపమ్మ ఉత్సవాలు ప్రారంభం


అన్నదేవరపేట ఆలయంలో పుష్పాలంకరణలో ఉన్న బంగారు పాపమ్మ

తాళ్లపూడి: అన్నదేవరపేట గ్రామస్తుల ఆరాధ్య దేవత బంగారు పాపమ్మ అమ్మవారి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు రుద్రపాక వంశస్తుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి విఘ్నేశ్వర పూజ, లలితా సహస్రనామం, కుంకుమ పూజలు, పుష్పాలంకరణ, ప్రభలోత్సవం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారితో పాటు, ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. గ్రామంలోని ఆడపడుచులు అమ్మవారికి గాజులు, చీరలు సమర్పించారు. ఐదు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు, జెయింట్ వీల్, ట్రైయిన్ తదితర వాటితో సందడి నెలకొంది. ఆలయం వద్ద లైటింగ్, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం


నల్లజర్లలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సమితి ప్రతినిధులు

నల్లజర్ల: రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ ఎస్సీ ఉప కులాల వర్గీకరణను తామంతా వ్యతిరేకిస్తున్నామని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పేర్కొంది. మంగళవారం నల్లజర్లలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు క్యాంపు కార్యాలయంలో ఆయనను కలసి వర్గీకరణ జరగకుండా ప్రభుత్వంపై వత్తిడి తేవాలని కోరుతూ సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల ఐక్యత దెబ్బతీసేలా వర్గీకరణ ప్రయత్నాలు చేయడం, దానికి ఏకసభ్య కమిషన్ వేయడమే కాకుండా, వర్గీకరణకు అనుకూలంగా నివేదిక ఇవ్వమని కోరడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఏక పక్షంగా ఒక వర్గం ప్రయోజనాల కోసం, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తలొగ్గి ఎస్సీ వర్గీకరణ చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించారు. తమ ఆవేదనను శాసన సభ దృష్టికి తీసుకురావాలని వారు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. సమితి ప్రతినిధులు వీరమళ్ల అనిల్‌కుమార్, వడ్డి శ్రీను, గుదే శ్రీనివాస్, ఏలేశ్వరావు, బాబ్జి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా ప్రదర్శన

నిడదవోలు: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పట్టభద్రుల ఓటర్ల జాబితాను ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామని మంగళవారం తహసీల్దార్ ఎం.నాగరాజు నాయక్ తెలిపారు. మున్సిపల్, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ కార్యాలయాల్లో ఈ జాబితా అందుబాటులో ఉంచినట్టు చెప్పారు.

లైసెన్స్‌డ్ ఏజెన్సీల ద్వారా విదేశాలకు వెళ్లాలి

డీఎస్పీ దేవకుమార్


సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు: లైసెన్సులు పొందిన ఏజెన్సీల ద్వారానే విదేశాల్లో ఉపాధి కోసం వెళ్లాలని డీఎస్పీ జి.దేవకుమార్ అన్నారు. గల్ఫ్‌తో పాటుచ ఇతర దేశాలకు వెళ్లి మోసపోతున్న వారి కోసం మంగళవారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విదేశీ వ్యవహారాల శాఖకు చెందిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఆర్.కృష్ణకుమార్, ఏ.రవికుమార్ మాట్లాడుతూ, టూరిస్టు వీసాపై విదేశంలోనే ఉండిపోవడం భారతీయ చట్టాల ప్రకారం నేరమన్నారు. టూరిస్టు వీసాలపై వెళ్లి, గల్ఫ్ దేశాల్లో వర్కింగ్ వీసాలుగా మార్చుకునే వెసులుబాటు ఉందన్నారు. అక్కడ ఇండియన్ ఎంబసీని సంప్రదించాలని సూచించారు. లైసెన్స్ లేకుండా విదేశాలకు పంపించే ఏజెంట్లకు రెండేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది తమకు 200 వరకు ఫిర్యాదులందాయని, వీటిలో 180 వరకు పరిష్కరించామన్నారు. రూ.270 చెల్లిస్తే రూ.10 లక్షల వరకు బీమా సదుపాయం లభిస్తుందన్నారు. ప్రవాస భారతీ సేవా కేంద్రం వెబ్‌సైట్‌లో వివిధ దేశాల్లో ఉన్న ఉపాధి అవకాశాలు, లైసెన్స్‌డ్ ఏజెంట్ల వివరాలు ఉంటాయన్నారు. ఏదైనా సహాయం కోసం హెల్ప్‌డెస్క్ 01126 885021కి కాల్ చేయాలని కోరారు. విదేశాల నుంచి అయితే 1800113090 నంబర్‌కి కాల్ చేయాలన్నారు. విదేశాలకు వెళ్లి మోసపోయిన పలువురు తమ అనుభవాలను వివరించారు. సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు, డివిజన్‌లోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల మేరకు పంటలు వేయాలి

కొవ్వూరు: భూసార పరీక్షల ఫలితాలను అనుసరించి పంటలు వేయడం ద్వారా సత్ఫలితాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ఏ.గంగాధర్ అన్నారు. మండలంలో వేములూరు, దొమ్మేరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన భూసార పరీక్షల ఫలితాల కార్డులను రైతులకు అందజేశారు. రైతులు రబీకి అనువైన ఎంటీయూ 1121 వంటి వంగడాన్ని సాగు చేయాలని సూచించారు. భూసార పరీక్షలను అనుసరించి ఎరువుల వాడుకోవాలన్నారు. కాంప్లెక్స్ ఎరువులను పంట ఆఖరి దమ్ములో వేసుకోవాలని, లేదంటే పంట ఊడ్చిన వారం రోజుల్లో వేయాలన్నారు. జింకు దాతువు లోప నివారణకు ఎకరాకి 20కిలోల చొప్పున జింక్ సల్ఫేట్ మూడు పంటలకు ఒకసారి వాడుకోవాలని సూచించారు. రైతులు జింక్ వేసిన 48 గంటల తర్వాతే భాస్వరం ఎరువులు వేయాలని జింక్, భాస్వరం ఎరువులను కలిపి వాడరాదన్నారు.

వరి కోతలు నిలిపివేయాలి

నల్లజర్ల: రానున్న మూడు రోజుల్లో మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మండలంలో వరికోతలు నిలిపివేయాలని ఏఓ కమల్‌రాజ్ రైతులకు సూచించారు. మొత్తం 8,343 ఎకరాలకు 4,023 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


ఉసులుమర్రులో జరుగుతున్న వేంకటేశ్వరస్వామి కల్యాణం

పెరవలి: ఉసులుమర్రులో ఉన్న వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం సోమవారం రాత్రి కనుల పండువగా జరిగింది. వశిష్ఠ గోదావరి గట్టున నిర్వహించిన ఈ కల్యాణం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య అలివేలు మంగా, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామికి భక్తుల సమక్షంలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు స్వామివారి ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు


అన్నవరప్పాడులో సామూహిక వ్రతాలాచరిస్తున్న దంపతులు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో ఉమా విశ్వేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. వందలాది దంపతులు ఇందులో పాల్గొన్నారు. తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పండితులు అల్లవరపు ఫణిశర్మ నిర్వహించగా, వ్రతాలలో సుమారు 200 మంది దంపతులు పాల్గొన్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అన్ని చట్టాలకు రాజ్యాంగమే మూలం


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి దేవి

కొవ్వూరు: భారత రాజ్యాంగం అన్ని చట్టాలకు మూలమని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జేబీటీఎస్ దేవి అన్నారు. కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్‌లో మంగళవారం న్యాయ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వరకట్నం తీసుకున్నా, ఇచ్చినా నేరమేనన్నారు. ఈ మహమ్మారిని సమాజం నుంచి తరిమి వేయాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు ఏకాదశ రుద్రాభిషేకం

దేవరపల్లి: కార్తికమాసం సందర్భంగా దేవరపల్లిలో ఉన్న పార్వతి సమేత ఉమారామలింగేశ్వరస్వామికి బుధవారం ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్న సమారాధన జరుగుతుందన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గణేశ్వరి ఎంపిక

ఉండ్రాజవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలకు తాడిపర్రు ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిని పి.లక్ష్మి గణేశ్వరి ఎంపికైనట్టు పీఈటీ కె.దుర్గ మంగళవారం తెలిపారు. హెచ్ఎం కోటిపల్లి సరోజిని, గ్రామ పెద్దలు విద్యార్థినిని అభినందించారు.

బెల్లపు ఊట ధ్వంసం

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి శివారు ఆవచెర్వులో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సమిశ్రగూడెం ఏఎస్సై గంగాధరరావు మంగళవారం తెలిపారు. ఈ సరకుకు సంబంధించిన వ్యక్తులను గుర్తించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు.

దేశానికి దశ, దిశ నిర్దేశించిన రాజ్యాంగం

మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


కొవ్వూరులో అంబేడ్కర్ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు


దేవరపల్లిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

కొవ్వూరు: భారత రాజ్యాంగం దేశానికి దశ, దిశ నిర్దేశించిందని వైఎస్సార్ సీపీ నియోకజవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. రాజ్యాంగం ఆమోద దినోత్సవం సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగం దేశానికి ఒక దిక్సూచీ వంటిదన్నారు. రాజ్యాంగానికి గౌరవం లేకుండా చేస్తున్న టీడీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను నేడు రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని ధ్వజమెత్తారు. చాగల్లు, తాళ్లపూడి ఎంపీపీలు మట్టా వీరాస్వామి, జొన్నకూటి పోసిరాజు, పార్టీ నాయకులు గండ్రోతు సురేంద్రకుమార్, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, జుట్టా ఏడుకొండలు, రుత్తల భాస్కరరావు, సుంకర సత్యనారాయణ, నగళ్లపాటి శ్రీనివాస్, పిట్టా శ్రీనివాస్, దొమ్మేరు సర్పంచ్ తానేటి కుమారి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.జయలక్ష్మి నివాళులు అర్పించారు. ప్రభుత్వ గిరిజన కళాశాల బాలికల వసతి గృహంలో విద్యార్థులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఐరన్ సిరప్‌లు అందజేశారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాణి సుస్మిత సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత: ఎమ్మెల్సీ

దేవరపల్లి: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ ఇల్లా వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక బీహెచ్ఎస్సార్ వీఎల్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్సీ నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగంలో పొందుపర్చిన అంశాలు సక్రమంగా అమలైతేనే దేశ భవిష్యత్తు బాగుంటుందన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, యూత్ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీడీఓ వేణుగోపాలకృష్ణ, ఎంఈఓ ఎం.తిరుమలదాస్, పలువురు ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ సచివాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి సర్పంచ్ కడిమి వీరకుమారి, యర్నగూడెంలోని బాలికల హాస్టల్‌లో సంక్షేమాధికారి ధనలక్ష్మి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు. గౌరీపట్నం, యర్నగూడెం గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు అంబేడ్కర్ యువజన సంఘ నేతలు నివాళులర్పించారు.

చాగల్లు: మండలంలోని చాగల్లులో శాఖా గ్రంథాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి గద్దే శ్రీనివాసరావు, రీడర్స్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు. ఎస్సీ ఏరియాలో అంబేడ్కర్ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటించారు. నందిగంపాడులో సచివాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో ఎ.శ్రీదేవి నివాళులర్పించారు. సర్పంచ్ కె.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు. బ్రాహ్మణగూడెం, చాగల్లు, మార్కొండపాడు, చిక్కాల తదితర సచివాలయాల వద్ద కార్యక్రమాలు జరిగాయి.

తాళ్లపూడి: విద్యార్థులకు బోధనలో నైతిక విలువలను నేర్పించాలని ఎంఈవో సీహెచ్ బాలామణి అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీవిజేతా హైస్కూల్ వద్ద వివిధ రంగాలకు చెందిన 11 మందిని ఘనంగా సత్కరించారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఎంఈవో సీహెచ్ నెహ్రూజీ, ఏఎస్‌వో జె. వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.లను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేసారు. అదేవిదంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో రాజ్యాంగ దినోత్సవాలు జరిగాయి. అన్నదేవరపేటలో అంబేడ్కర్ విగ్రహనానికి నివాళులు అర్పించారు. గజ్జరంలో సర్పంచ్ గండి రాంబాబు ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు..

నిడదవోలు: ప్రజలను దేశంగా కలిపి ఉంచడంలో రాజ్యాంగానిది కీలక పాత్ర అని ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ డి.రుద్ర అన్నారు. స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం కంబయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మెప్మా విభాగం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మెప్మా సిటి మేనేజర్ ఎ.జ్యోతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్‌పర్సన్లు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు. పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీన పరుస్తోందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు విమర్శించారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఎస్వీడీ మహిళా డిగ్రీ కళాశాల, చర్చిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

ఉండ్రాజవరం: రాజ్యాంగ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో వి.రామారావు అన్నారు. ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈఓ కార్యాలయంలో ఎంఈవో-1 సక్సేనారాజు, ఎంఈవో-2 శారద జ్యోత్స్న కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. మోర్త ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు. పాలంగి సచివాలయంలో సర్పంచ్ బొక్క శ్రీనివాసు, సెక్రటరీ హసన్‌జానీ ఆధ్వర్యంలో, తాడిపర్రు హైస్కూల్‌లో హెచ్ఎం కె.సరోజని ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాలు జరిగాయి.

గోపాలపురం: కోట్లాది మంది భారతీయులను ఏకతాటిపై నడిపించేది రాజ్యాంగమని పీవీరావు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దొడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. వేళ్లచింతలగూడెంలో అంబేడ్కర్ విగ్రహానికి మాయన నివాళులర్పించారు. గోపాలపురం మండల పరిషత్ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది.

నల్లజర్ల: రాజ్యాంగ దినోత్సవాన్ని నల్లజర్ల శాఖా గ్రంథాలయ చైర్మన్ జి.సుశీల ఆధ్వర్యంలో జరిగింది. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.